


మే చివరిలోగా హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లు తప్పనిసరి

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హై సెక్యూరిటీ రిజిస్టర్డ్ ప్లేట్ల (హెచ్ఎస్ఆర్‌పీ) ఏర్పాటుకు గడువు పెంచే అవకాశం లేదని, మే నెలాఖరులోగా తప్పనిసరి అని రవాణాశాఖ బుధవారం ప్రకటించింది. గత ఏడాది నవంబరు, ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ గడువు పెంచారు. మరోసారి పెంచే యోచన లేదని అధికారులు తెలిపారు. 2019 ఏప్రిల్‌కు ముందు రిజిస్ట్రేషన్ చేసిన ద్విచక్ర, త్రిచక్ర, ఎల్ఎంవీ, కార్లు, మధ్య, భారీ వాహనాలు, ట్రాక్టర్‌లకు హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్‌లు తప్పనిసరి చేశారు. అన్ని వాహనాలకు అమర్చుకోవాల్సి ఉంటుంది. లేకపోతే రూ.500 జరిమానా విధించనున్నారు.

నిర్లక్ష్యం..వీడండి..



- ఓటేసేందుకు కదలిరండి ● రేపటి పోలింగ్‌కు అన్నీ సిద్ధం
- నగరంలో ఓటింగ్ శాతం పెరగాలి ● పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు
- బెంగళూరు గ్రామీణకు కేంద్ర పోలీసు బలగాలు ● అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ● చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా



మీడియాతో మాట్లాడుతున్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఓటరు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, నిర్లక్ష్యం వీడి పోలింగ్‌కు కదలిరావాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా పిలుపునిచ్చారు. బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రెండింతల కేంద్ర సాయుధ పోలీసుబలగాలను ఏర్పాటు చేశామని, నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌క్యాస్టింగ్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. బుధవారం నగరంలో ఎన్నికల సహాయ అధికారులు కూర్మారావు, ఆర్ వెంకటేశ్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలివిడత శుక్రవారం పోలింగ్ జరిగే ఏర్పాట్లు, ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఓటర్ల సమగ్ర వివరాలను మీడియాకు వివరించారు.

తొలి విడత పోలింగ్ జరగనున్న స్థానాలు

ఉడుపి-చిక్కమగళూరు, హాసన్, చిత్రదుర్గ, తుమకూరు, మండ్య, మైసూరు, చామరాజనగర, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు దక్షిణ, బెంగళూరు సెంట్రల్, చిక్కబళ్లాపుర, కోలారు, దక్షిణ కన్నడ

14 స్థానాల్లో 2.88 కోట్ల మంది

తొలి విడత 14 నియోజకవర్గాల్లో 2,88,19,342 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1,44,17,530 మంది పురుషులు, 1,43,87,585 మంది మహిళలు, 3,067 ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారన్నారు. 11,160మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. బెంగళూరు ఉత్తరలో 32,15,261మంది అత్యధిక ఓటర్లు కాగా ఉడుపి-చిక్కమగళూరులో అత్యల్పంగా 15,85,721మంది ఉన్నారు. ఉడుపి ఓటర్లతో పోలిస్తే రెండింతలకంటే ఎక్కువమంది బెంగళూరు ఉత్తర నియోజకవర్గంలో ఉన్నారు. ఆ తర్వాత బెంగళూరు గ్రామీణలో 28.02 లక్షలమంది, బెంగళూరు సెంట్రల్‌లో 24.34 లక్షల మంది, బెంగళూరు దక్షిణలో 23.41లక్షలమంది, మైసూరులో 20.94లక్షలమంది ఉన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో 16-20లక్షలలోపు ఓటర్లు ఉన్నారు.



30,602 పోలింగ్ కేంద్రాలు



14 నియోజకవర్గాల పరిధిలో 30,602 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న 14 లోక్‌సభ స్థానాల పరిధిలో 112 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. గత కొన్ని ఎన్నికల పోలింగ్‌శాతం ప్రకారం బీబీఎంపీ పరిధిలోని 28 ఎమ్మెల్యే స్థానాలు, మైసూరులో 3, తుమకూరులో 1, మంగళూరు దక్షిణ స్థానాలతో కలిపితే 33 నియోజకవర్గాల్లో పోలింగ్‌శాతం అత్యల్పమన్నారు. అందుకే పోలింగ్‌శాతం పెంచేందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగించామన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో 5 పింక్‌బూత్‌లతోపాటు ఒక ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ద్వేషపూరిత ప్రసంగాలపై 23 కేసులు

ద్వేషపూరితమైన ప్రసంగాలపై 23 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో బీజేపీ నాయకులపై 12, కాంగ్రెస్ వారిపై 9, జేడీఎస్ వారిపై 2 కేసులు నమోదయ్యాయి. వ్యక్తిగత విమర్శలపైకి బీజేపీపై 8, కాంగ్రెస్‌పై 9, జేడీఎస్ 3, కాగా 8మంది ఇండిపెండెంట్లపై కేసులు నమోదయ్యాయన్నారు. ధార్మిక సంస్థలను ఉపయోగించుకున్న మేరకు బీజేపీపై 8, కాంగ్రెస్‌పై 6, జేడీఎస్‌పై ఒక కేసు నమోదైంది. ఎన్నికల్లో తీవ్రస్థాయిలో కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 189 కేసులు నమోదు చేశారు. హాసన్ లోక్‌సభ పరిధిలో పెన్‌డ్రైవ్ ద్వారా అభ్యర్థిని కించపరిచేలా ప్రచారం చేసిన విషయమై కేసు నమోదు చేశామన్నారు. జయనగర్‌లో పట్టుబడిన రూ.2కోట్ల నగదుపై బీజేపీ కార్యదర్శిపై కేసు నమోదైందన్నారు. వాస్తవానికి రూ.5కోట్లు డ్రా చేసేందుకు ప్రయత్నించారని, కేవలం రూ.2 కోట్ల నగదు రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఐటీ పర్యవేక్షిస్తోందన్నారు.

2.50 లక్షలమంది ఉద్యోగులు

14 లోక్‌సభ స్థానాల పోలింగ్ కోసం 2.50లక్షలమందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వీరిలో 1.40లక్షలమంది పోలింగ్ ఆఫీసర్‌లు, ఉద్యోగులు ఉన్నారు. 5వేలమంది మైక్రో అబ్జర్వర్‌లు, 50వేలమంది పోలీసులు, 65 ప్లటూన్‌ల సాయుధబలగాలు ఉంటాయన్నారు. 19,701 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, 1370 పోలింగ్‌స్టేషన్‌లలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సౌకర్యాలు

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఓటర్లతోపాటు సిబ్బంది కోసం సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, శౌచాలయం, వైద్య సౌకర్యంతో పాటు అత్యవసరం వేళ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ర్యాంప్‌లు ఉన్నాయన్నారు. అయినా కొన్ని చోట్ల సమస్యలు ఉంటే సిబ్బంది సహకరిస్తారన్నారు. ఓటరు గుర్తింపు కార్డులు బెంగళూరులో 90శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 93-94శాతం పంపిణీ చేశామన్నారు.

బెంగళూరు గ్రామీణలో పటిష్ట బందోబస్తు



బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గంపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. ఇప్పటివరకు ఎన్నికల అబ్జర్వర్‌లు, పోలీసు అధికారులు, అభ్యర్థులనుంచి వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయి రెండంచెల సాయుధ బందోబస్తు ఉంటుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందన్నారు.

యాప్ ద్వారా పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు



యాప్ ద్వారా పోలింగ్ స్టేషన్ గుర్తింపుతోపాటు పార్కింగ్, క్యూ లైన్ గురించి తెలుసుకునే వెసలుబాటు కల్పించినట్లు ఎన్నికల అధికారి మీనా తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ను ఓటరు స్లిప్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా గుర్తించవచ్చునన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ విధానం తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. గతంలో ఆయా అభ్యర్థులే తమ బలగంతో ఇంటింటికీ తిరిగి స్లిప్పులు ఇచ్చేవారు. రెండేళ్లుగా పలు ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది ద్వారా స్లిప్పులు పంచిపెట్టిన ప్రభుత్వం మారిన సాంకేతిక పరిస్థితుల నేపథ్యంలో మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది.

భో'జనాని'కి హైకోర్టు అనుమతి..

- ఓటు వేసినవారికి ఉచిత ఆహారం ● హోటళ్ల యజమానుల అభ్యర్థనకు ఓకే

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగించుకున్న వారికి ఉచితంగా ఆహారం ఇవ్వదలిచిన హోటళ్ల నిర్ణయానికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. నిబంధనలు పాటించాలని సూచించింది. గత శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారికి నగరంలోని కొన్ని హోటళ్లు ఉచితంగా తినుబండారాలను సమకూర్చాయి. అదే తరహాలోనే 26న శుక్రవారం జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున పంపిణీ చేస్తామని ప్రకటించారు. కొన్ని అభ్యంతరాలు తలెత్తడంతో బృహత్ బెంగళూరు హోటల్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. ఈమేరకు బుధవారం న్యాయమూర్తి నాగప్రసన్న మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. అయితే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని సూచించారు. ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు కలిగి ఉండరాదని, ఓటు వేసిన వారికి మాత్రమే ఆహారం సమకూర్చవచ్చునని సూచించింది. పోలింగ్‌శాతం పెంచేందుకు హోటళ్ల యాజమాన్యం గత ఎన్నికల్లో తినుబండారాలను అందించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ అమలు చేయదలిచారు.



ప్రచారానికి బ్రేక్..

రాష్ట్రంలో తొలి విడతగా శుక్రవారం పోలింగ్ జరిగే 14 స్థానాల పరిధిలో బుధవారం సాయంత్రానికే ప్రచారం ముగిసింది. బహిరంగసభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్‌లు, గుంపులుగా వెళ్లడం ఇక నిషేధంగా ఉంటుంది. అయితే రాష్ట్రంలో రెండో విడత 14 లోక్‌సభ స్థానాలకు జరిగే ఎన్నికల ప్రచారానికి అభ్యంతరం లేదన్నారు. కానీ తొలి విడత ఎన్నికలు జరిగే నియోజకవర్గాలలో అభ్యర్థుల పేరిట ప్రచారం చేయదన్నారు.

తొలివిడత పోలింగ్ నియోజకవర్గాలు 14



ఓటర్లు 2,88,19,342
అత్యధికం: బెంగళూరు ఉత్తర - 32,15,261మంది
అత్యల్పం:ఉడుపి-చిక్కమగళూరు - 15,85,721మంది
పోలింగ్ కేంద్రాలు 30,602
పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ 19,701
పోలింగ్‌స్టేషన్‌లలో సీసీ టీవీ కెమెరాలు 1370
విధులు నిర్వహించనున్న ఉద్యోగులు 2.50 లక్షల మంది

కేంద్రమంత్రి జోషితో హర్షికా దంపతుల భేటీ



కేంద్రమంత్రి జోషితో చర్చిస్తున్న హర్షికా పూణచ్చ దంపతులు

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం ఫ్రేజర్‌టౌన్‌లో హోటల్‌కు వెళ్లిన హీరోయిన్ హర్షికాపూణచ్చ దంపతులపై దౌర్జన్యం సంఘటనలో న్యాయం చేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషితో బుధవారం భేటీ అయ్యారు. పార్కింగ్ నుంచి కారు తీసేవేళ కన్నడలో మాట్లాడినందుకు దౌర్జన్యానికి ప్రయత్నించారని, బంగారు ఆభరణాలు లాగేసుకునే ప్రయత్నం చేశారని వివరించారు. ఈ మేరకు పులకేశినగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని న్యాయం చేయాలని మంత్రికి వివరించారు. తమపై దాడికి పాల్పడిన ముగ్గురిని గుర్తించామని, మిగిలినవారిపై చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. మరెవ్వరికీ ఇలా జరగకూడదనే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారికి న్యాయం జరిగేలా చూస్తామని జోషి హామీ ఇచ్చారు.

సీఐడీ కస్టడీకి ఫయాజ్

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎంసీఏ విద్యార్థిని నేహా హత్యకేసు నిందితుడు ఫయాజ్‌ను బుధవారం సీఐడీ కస్టడీలోకి తీసుకుంది. నేహా హత్యకేసును హుబ్బళ్ళి పోలీసులు దర్యాప్తు చేస్తుండగా మంగళవారం సీఎం సిద్దరామయ్య సీఐడీకి అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు బుధవారం సీఐడీ అధికారులు కేసును తమ పరిధిలోకి తీసుకున్నారు. ఎస్పీ వెంకటేశ్ నేతృత్వంలోని బృందం ఫయాజ్‌ను అదుపులోకి తీసుకునేందుకు హుబ్బళ్ళిలోని ఒకటో జేఎంఎఫ్‌సీ కోర్టు విచారణ జరిపి ఆరు రోజుల పాటు సీఐడీకి అప్పగించింది. ఈమేరకు సీఐడీ బృందాలు ఫయాజ్‌ను అదుపులోకి తీసుకుని హుబ్బళ్ళిలోని పలు ప్రాంతాల్లో పంచనామా జరిపారు. హత్యకు గల కారణాలను ఛేదించేందుకు సీఐడీ కసరత్తు ప్రారంభించింది.

బెంగళూరు సహా 5 రైల్వే స్టేషన్లలో
రూ.20కే జనతా భోజనం



ఐఆర్‌సీటీసీతో రైల్వే శాఖ ఒప్పందం

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణీకులకు జనతా రూ.20కే భోజనం అందించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ), రైల్వేశాఖ ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం 20 రూపాయలకే భోజనాన్ని అందజేయనున్నారు. నైరుతి రైల్వే పరిధిలో బెంగళూరు కేఎస్ఆర్, యశ్వంతపుర, విజయపుర, మైసూరు, బళ్ళారి రైల్వే స్టేషన్‌లలో సౌలభ్యం అందుబాటులోకి రానుంది. జనరల్ బోగీలలో ప్రయాణించేవారికి ఆరోగ్యకరమైన భోజనం, టిఫిన్‌లు సమకూర్చే కొత్త విధానమిది. దేశవ్యాప్తంగా 100 రైల్వే స్టేషన్‌లలో 150 కౌంటర్‌ల ద్వారా వేసవిలో ఈసౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జనరల్ బోగీలలో ప్రయాణించేవారికి నాణ్యమైన ఆహారం అందించనున్నారు. సెకండ్‌క్లాస్ బోగీలు నిలిచే ప్లాట్‌ఫాం వద్దనే ఫుడ్ కౌంటర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 200 గ్రాముల చిత్రాన్నం, పులిహోర లేదా పెరుగన్నం రూ.20కే అందించనున్నారు. ఇక 350గ్రాములతో దక్షిణాది శైలి భోజనాన్ని రూ.50కే సమకూర్చనున్నట్లు రైల్వే అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.


ప్రచారం ముగిసింది..
ఇక ప్రసన్నమే..


- ముగిసిన తొలివిడత ప్రచారం ● ఓటర్ల మెప్పుకోసం యత్నం ● రేపే పోలింగ్

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకుపైగా సాగిన ప్రచార హోరు ముగిసింది. రాష్ట్రంలోని 14 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. ప్రచారం ముగియడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు నిమగ్నమయ్యారు. బుధవారం సాయంత్రానికి ప్రచారపట్టం ముగిసింది. 14 నియోజక వర్గాలలో రాష్ట్రంలోని కీలకమైన నాలుగు నగరాలు తొలివిడత జాబితాలోనే ఉన్నాయి. ఈ నాలుగు నగరాలు ఎన్నికలకు ప్రతిష్టాత్మకమైనవి. బెంగళూరు నగర పరిధిలో 4 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. బెంగళూరు దక్షిణ నుంచి బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ తేజస్వి సూర్య, కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక బెంగళూరు సెంట్రల్ నుంచి బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ పీసీ మోహన్, కాంగ్రెస్ నుంచి విద్యావేత్త మన్సూర్ అలీఖాన్ బరిలో ఉన్నారు. బెంగళూరు ఉత్తర నుంచి బీజేపీ తరపున కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె, కాంగ్రెస్ నుంచి ప్రొఫెసర్ రాజీవ్‌గౌడ పోటీ చేస్తున్నారు. బెంగళూరు గ్రామీణ నియోజకవర్గం తొలి విడతలో కీలకమైనది. కాంగ్రెస్ నుంచి డీసీఎం, పార్టీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తమ్ముడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్ బరిలో ఉండగా ప్రత్యర్థిగా పద్మశ్రీ గ్రహీత డాక్టర్ సీఎన్ మంజునాథ్ బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కోలారు నుంచి బీజేపీ తరపున మల్లేశ్‌బాబు, కాంగ్రెస్ నుంచి గౌతమ్‌లు ఇరువురూ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి వచ్చారు. చిక్కబళ్ళాపుర నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్, కాంగ్రెస్ నుంచి ఎంఎస్ రామయ్య గ్రూప్ విద్యాసంస్థలకు చెందిన రక్షా రామయ్య పోటీ చేస్తున్నారు. మండ్య నుంచి జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి, కాంగ్రెస్ నుంచి వెంకటరమణేగౌడ అలియాస్ స్టార్ చంద్రు బరిలో ఉన్నారు. మైసూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా యువరాజు యదువీర్, కాంగ్రెస్ నుంచి అధికార ప్రతినిధి లక్ష్మణ్ పోటీలో ఉన్నారు. చామరాజనగర నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రి మహదేవప్ప కుమారుడు సునీల్ బోస్, బీజేపీ అభ్యర్థిగా బాలరాజు పోటీలో ఉన్నారు. హాసన్ నుంచి జేడీఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రేయస్ పటేల్ బరిలో ఉన్నారు. ఇక ఉడుపి-చిక్కమగళూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా విధానపరిషత్ ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారి, కాంగ్రెస్ అభ్యర్థిగా జయప్రకాశ్ హెగ్డే పోటీ చేస్తున్నారు. దక్షిణకన్నడ నుంచి బీజేపీ అభ్యర్థిగా కెప్టెన్ బ్రిజేశ్‌చౌటా, కాంగ్రెస్ నుంచి పద్మరాజ్ పూజారి బరిలో ఉన్నారు. ఇక చిత్రదుర్గ నుంచి బీజేపీ అభ్యర్థిగా గోవింద కారజోళ, కాంగ్రెస్ నుంచి బీఎన్ చంద్రప్ప, తుమకూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా సీనియర్ నేత సోమణ్ణ, కాంగ్రెస్ నుంచి ముద్దహనుమేగౌడ పోటీ చేస్తున్నారు. తొలి విడత ప్రచారం ఉత్సాహంగా సాగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు అన్ని నియోజకవర్గాల్లోనూ సుడిగాలిలా తిరిగి ప్రచారం సాగించారు. బీజేపీ నుంచి అగ్రనేతలు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు కేంద్రమంత్రులు ప్రచారం చేయగా కాంగ్రెస్ నుంచి రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రచారం చేశారు. నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థులు దాదాపు ప్రకటించడంతో సుదీర్ఘకాలంపాటు ప్రజల్లో తిరిగారు. ఎండవేడిమిని సైతం లెక్క చేయకుండా రోడ్‌షోలు, ర్యాలీల హోరు సాగింది. మూడువారాలకుపైగా సాగిన రణధ్వనులు మూగబోయాయి.

మద్యం విక్రయాలకు బ్రేక్

తొలి విడత పోలింగ్ జరిగే 14 లోక్‌సభ స్థానాల పరిధిలో మద్యం విక్రయాలకు బ్రేక్ పడింది. బుధవారం సాయంత్రం 6 గంటలనుంచే మద్యం విక్రయాలు ఆపేలా ఉత్తర్వులు జారీ చేశారు. 25న గురువారం, పోలింగ్ జరిగే 26న శుక్రవారం రాత్రి దాకా మద్యం విక్రయాలు ఉండవు. మద్యం విక్రయాలు ఉండవని భావించిన నగర ప్రజలు బుధవారం మధ్యాహ్నం బారులు తీరి కొనుగోలు చేశారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో గురువారం నుంచే బందోబస్తు చర్యలు కొనసాగనున్నాయి.







బసవ రాజేశ్వరీ (ఫైల్)



హ్యాట్రిక్ ఎంపీ ఎమ్మెల్యే

● బళ్లారి జిల్లా రాజకీయ చరిత్రలో దిగ్గజం బసవరాజేశ్వరి

● మూడు సార్లు ఎంపీగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా.. ● కన్నడ ఐరన్ లేడీగా గుర్తింపు

బళ్లారి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మాతా బసవరాజేశ్వరి, ఈ పేరు కర్ణాటకలో వినని వారే ఉండరు. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం మురడీ హనుమాపురం గ్రామంలో పుట్టి. మెట్టినిల్లు అయిన కర్ణాటకకు వచ్చిన ఆమె రాజకీయ జీవితం చిరస్మరణీయం. నేటికీ బసవరాజేశ్వరి అంటే కర్ణాటక రాష్ట్రంతో పాటు ఢిల్లీ రాజకీయాల్లోనూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే మాటల లతో పాటు కొండత గుండెధైర్యం ఆమె సొంతం. చాలా మంది కర్ణాటక ఇందిరమ్మ అని కూడా అప్పట్లో పిలిచేవారట.

● 1954లో కాంగ్రెస్‌లో చేరిన బసవరాజేశ్వరి 1984లో తొలిసారి లోక్‌సభకు పోటీ చేశారు. ప్రత్యర్థి జేఎన్‌పీ ప్రకాశ్‌పై 72.296 ఓట్ల తేడాతో విజయం సాధించి బారీ విజయాన్ని నమోదు చేశారు. 1989సాధారణ ఎన్నికల్లో బసవరాజేశ్వరీ తిరిగి ఎన్నికైయ్యారు. జనతాదళ్ ఎస్.తిప్పన్నపై 76.085 ఓట్లతో విజయం సాధించారు. 1991లో జనతాదళ్ అభ్యర్థి నెట్టకల్లప్ప పై 65,981 ఓట్లతో విజయం సాధించారు. హ్యాట్రిక్ సాధించిన బసవరాజేశ్వరి పీవీ నరసింహరావు ప్రభుత్వంలో మానవ వనరుల అభివృద్ధి, స్త్రీ , శిశు సంక్షేమ సహాయ మంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్‌లో అంచెలంచెలుగా ఎదిగిన బసవరాజేశ్వరీ 2004లో బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌తో 50 ఏళ్ల అనుబంధానికి తెరపడింది. ఆమె ఫిబ్రవరి 2008లో మరణించారు.

మూడుసార్లు మాన్వి ఎమ్మెల్యేగా

బసవరాజేశ్వరీ బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగానే కాదు. పొరుగున ఉన్న రాయచూర్ జిల్లాలోని మాన్వి నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే గా కూడా కీర్తి సాధించారు. 1957నుంచి 1972వరకు వరుసగా మూడుసార్లు మాన్వినుంచి గెలుపొందారు. 1968, 1971 మధ్య ఆమె వీరంద్ర పాటిల్ ప్రభుత్వంలో కర్ణాటక సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆమె రెండు పర్యాయాలు (1976, 1984)లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా కూడా ఎన్నికైయ్యారు. 1984లో ఆమె రాజకీయ జీవితం జాతీయ రాజకీయాల వైపు మళ్ళింది. ఇలా రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన మహిళగా ఆమె ఖ్యాతి పొందారు.

● 1995లో బసవరాజేశ్వరికి భారతదేశ ప్రతినిధిగా గ్లోబల్ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడే అవకాశం వచ్చింది. 1995లో బీజింగ్ మహిళా సాధికార, అభివృద్ధి గురించి మాట్లాడేందుకు మహిళా సదస్సుకు వెల్లింది. ఇలా ఎన్నోరకాలుగా రాజకీయ మైలు రాళ్లను బసవరాజేశ్వరి అందుకుంది. ఆమెను చాలా మంది ఐరన్ లేడీగానూ, మరికొందరు ఇందిరా గాంధీలా పోల్చేవారు. ఆనాడు ఎంపీగానూ, ఎమ్మెల్యేగానూ గెలిచి సమాజం కోసం ఆమే ఎన్నో మంచిపనులు చేసింది. బళ్లారిలో ప్రముఖంగా ఉండే జిందాల్ స్టీల్ ఐరన్ కంపెనీ కూడా ఇందిరాగాంధీ కాలంలో వచ్చిందే. ఇలాంటి పరిశ్రమలు రావడానికి బసవరాజేశ్వరి లాంటి గొప్పనాయకుల కృషి ఎంతగానో ఉంది. మరి ఈ నాటి నాయకులు కూడా ప్రజాహితం కోసం అభివృద్ధి పనులు చేసి ప్రజలు మన్నలు పొందాలని పలువురు కోరుతున్నారు.



మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూ...

బెంగళూరు దక్షిణలో ఎవరిదశ తిరిగేనో?

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలలో ప్రత్యేక స్థానం కల్గిన బెంగళూరు దక్షిణ లోక్‌సభ స్థానం నుంచి ఎవరి దశ తిరిగేనో అనేది సర్వత్రా ఉత్కంఠ అవుతోంది. బెంగళూరు దక్షిణ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా ఉంది. ఈ ప్రాంతంలో అత్యధిక విద్యావంతులు, భిన్నమైన వర్గాలకు చెందినవారు ఉన్నారు. ఇదే స్థానం నుంచి అనంతకుమార్ సుదీర్ఘకాలంపాటు ఎంపీగా గెలుపొందుతూ వచ్చారు. ఐదేళ్లకో సారి ఈ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున ధీటైన అభ్యర్థిని పోటీ చేయించడం, ఓటమి చవిచూడడం సాధారణమైపోయింది. 1996 నుంచి అనంతకుమార్ గెలుపొందుతూ వచ్చారు. అవే ఎన్నికల్లో వరలక్ష్మి గుండూరావు కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1998లో కాంగ్రెస్ నుంచి డీపీ శర్మ, 1999లో బీకే హరిప్రసాద్, 2004లో ఎం కృష్ణప్ప, 2009లో కృష్ణబైరేగౌడలు ఓటమి చెందినవారే. 2014 ఎన్నికల్లో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకణి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఈ స్థానం నుంచి ఆరుసార్లు వరుసగా గెలుపొందుతూ వచ్చిన అనంతకుమార్ జాతీయ రాజకీయాల్లో రాణించారు. కేంద్రంలో కీలకమైన మంత్రి పదవుల్లో కొనసాగారు. 2019 ఎన్నికల్లో తేజస్వి సూర్య బీజేపీ నుంచి గెలుపు సాధించారు. మరోసారి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి బరిలో ఉన్నారు. ఆమె జయనగర్ ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు కొనసాగారు. కాంగ్రెస్ సీనియర్ నేత మంత్రి రామలింగారెడ్డికి ఉన్న మంచి పేరు కలసి వస్తుందని కుమార్తె సౌమ్యరెడ్డికి టిక్కెట్ ఇచ్చారు. ఆమె రాజకీయాల్లో క్రమశిక్షణతోపాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చేవారుగా పేరొందారు. కాగా కొవిడ్ కాలంలో ఇరువురూ వైద్య శిబిరాలు, ఇతర కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. బెంగళూరు దక్షిణ లోక్‌సభ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. గోవిందరాజనగర (కాంగ్రెస్), విజయనగర్ (కాంగ్రెస్), చిక్కపేట (బీజేపీ), బసవనగుడి (బీజేపీ), పద్మనాభనగర్ (బీజేపీ), జయనగర్ (బీజేపీ), బీటీఎం లే అవుట్ (కాంగ్రెస్), బొమ్మనహళ్ళి (బీజేపీ) ఎమ్మెల్యేలు ఉన్నారు. ఐదుమంది బీజేపీ ఎమ్మెల్యేలు, ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కాగా బెంగళూరు దక్షిణలో 23,41,895 మంది ఓటర్లు కాగా 12,07,291మంది పురుషులు, 11,34,068 మంది మహిళలు, 400మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. 136మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.



తేజస్వి సూర్య(బీజేపీ)



సౌమ్యరెడ్డి(కాంగ్రెస్)



దక్షిణకన్నడలో పైచేయి ఎవరిదో..?

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధ్యాత్మికత, సముద్రతీరం, అంతర్జాతీయ విమానాశ్రయం కల్గిన ప్రాంతంగా పేరొందిన దక్షిణకన్నడలో పైచేయి ఎవరిది కానుందో అనేది సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. దక్షిణకన్నడ జిల్లా అంటేనే రాష్ట్రానికే కాకుండా దేశమంతటికీ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. పేరొందిన శైవక్షేత్రాలు ఇక్కడ వెలసి ఉన్నాయి. దక్షిణకన్నడ అంటేనే భిన్నమైన జీవనశైలి, కర్ణాటకలో ఉన్నా కన్నడ కాకుండా ప్రత్యేకమైన తుళు భాష ఇక్కడి విశేషం. తుళు కేవలం మాట్లాడేందుకే కాదు సాహిత్యం లోనూ చరిత్ర కల్గినది. ఇలాంటి నియోజకవర్గం దక్కించుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. నియోజకవర్గాల విభజన తర్వాత దక్షిణకన్నడ లోక్‌సభ స్థానంలో మార్పులు చేర్పులు జరిగాయి. రాష్ట్రంలోనే కాకుండా దక్షిణభారత్‌లోనే ప్రముఖమైన ఓడరేవు కల్గిన నగరం మంగళూరు. ఇక్కడ ఓడరేవుతోపాటు అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది. కేరళ సరిహద్దున ఉండడంతో ఆ రాష్ట్ర ప్రభావం కూడా ఈ జిల్లాలో ఉంది. అన్నింటికంటే హిందూత్వ అంశానికి ఇక్కడ ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. అదే తరహాలోనే ముస్లింల ప్రాబల్యం కూడా మంగళూరు తోపాటు సుళ్య, బంట్వాళ్, పుత్తూరులలోనే అధికం. దక్షిణకన్నడలో 18,18,127మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,86,642మంది పురుషులు కాగా 9,30,884మంది మహిళలు, 77మంది ట్రాన్స్‌జెండర్‌లు, 524మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

దక్షిణకన్నడ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బెళ్తంగడి (బీజేపీ), మూడబిదరి (బీజేపీ), మంగళూరు సిటీ (బీజేపీ), మంగళూరు దక్షిణ (బీజేపీ), మంగళూరు (కాంగ్రెస్), బంట్వాళ (బీజేపీ), పుత్తూరు (కాంగ్రెస్), సుళ్య (బీజేపీ) ఎమ్మెల్యేలు ఉన్నారు. 8 నియోజకవర్గాల్లో కేవలం రెండు చోట్ల మాత్రమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక్కడ మంగళూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యూటీ ఖాదర్ ప్రస్తుత శాసనసభ స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ఇదే స్థానం నుంచి మూడుసార్లు వరుసగా ఎంపీగా కొనసాగిన నళిన్‌కుమార్ కటీల్‌కు ఈసారి టిక్కెట్ దక్కలేదు. అయితే ఆయన ఎటువంటి వ్యతిరేకత లేకుండా పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారు. దక్షిణకన్నడ హిందూత్వ అజెండాకు బలమైన ప్రాంతం కావడం, ఆరుగురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండడంతో ఇక్కడ ఎన్నిక ప్రతిష్ఠాత్మకం అవుతోంది. బీజేపీ నుంచి మాజీ కేప్టెన్ బ్రిజేశ్‌చౌట పోటీ చేస్తున్నారు. 2013 నుంచి బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. సాహిత్య సభలు, సమావేశాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ ప్రాంతంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే కంబళ ఉత్సవాలకు ఈయన భాగస్వామ్యం వహిస్తారు. కాంగ్రెస్ తరపున పద్మరాజ్ ఆర్ పూజారి బరిలో ఉన్నారు. ఈయన న్యాయవాదిగా, సామాజిక సేవా రంగంలో పేరొందినవారు.



బ్రిజేశ్‌చౌట



దక్షణ కన్నడ చిత్రపటం



పద్మరాజ్‌పూజారి



దివ్యాంగుడికి ఓటు ప్రాధాన్యం వివరిస్తున్న జడ్పీ సీఈఓ



డోలు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు...

జాతరలో జాగో..

● హంపి జాతరలో ఓటరు జాగృతి

● ఓటు ప్రాధాన్యం వివరించిన అధికారులు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 24: పర్యాటక ప్రాంతం హంపిలో మంగళవారం జరిగిన జాతర కార్యక్రమంలో ప్రజలకు అధికారులు ఓటరు అవగాహన కల్పించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విజయనగర జిల్లా స్వీప్ సమితి ఆధ్వర్యంలో వివిధ రీతిలో ఓటరు జాగృతి కార్యక్రమాలు నిర్వహించడం స్థానిక ప్రజలను ఆకట్టుకుంది. హంపిలోని విరుపాక్ష దేవస్థానం ముందు భాగంలో ఉదయం ఓటరు అభియాన కార్యక్రమానికి జిల్లా పంచాయితీ సీఈఓ సదాశి ప్రభు డోలు వాయించి ప్రారంభించారు. వివిధ సంఘ సంస్థల మహిళలు తేరు వీధిలో ముగ్గులు వేసి ఓటరు జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలకు ఓటు ప్రాధాన్యం గురించి వివరించారు. జడ్పీ సీఈఓ జాతరకు వచ్చిన భక్తులకు, సార్వజనికులకు, వ్యాపారుల వద్దకు వెళ్ళి కరపత్రాన్ని అందజేసి ఓటు గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి రాయభారిగా వహించిన కారమం చప్ప, యోజనాధికారి అశోక్ జి.తోటద్, లక్ష్మీ కాంత్, ప్రతిబసప్ప, తాలూకా పంచాయతీ ఈఓ హరీష్ ఆర్. ఉమేష్, పీడీఓ గంగాధర్, ప్రసన్న కుమార్, ఫాజీల్, అహ్మద్, నాగరాజు, కొట్రేషులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తూ..



వైసీపీని వీడుతున్నట్లు ప్రకటిస్తున్న బత్తలపల్లి జడ్పీటీసీ కోటి సుధ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ సూర్యప్రకాశ్ బాబు, మరికొందరు (ఫైల్)



జగన్ పార్టీకి ఝలక్..!

వైసీపీకి గుడ్‌బై చెబుతున్న జడ్పీటీసీ, ఎంపీపీలు

పనులు సాగక తీవ్ర అసంతృప్తి

ఎటూ ఓడే పార్టీ అంటూ వీడుతున్న సభ్యులు

ఇప్పటికే ఇద్దరు జడ్పీటీసీలు దూరం

ఒక ఎంపీపీ సైతం రాజీనామా

అదే దారిలో మరికొందరు..

అనంతపురం విద్య, ఏప్రిల్ 24: ఎన్నికల వేళ అధికార పార్టీకి జడ్పీటీసీలు, ఎంపీపీలు షాక్ ఇస్తున్నారు. రోజుకొకరు పార్టీని వీడుతున్నారు. ఏళ్ల తరబడి వైసీపీలో ఉన్నా తాము ఎలాంటి పనులు చేసుకోలేకపోతున్నామన్న నిరాశ వారిలో కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీటీసీలకు ఏమాత్రం ప్రాధాన్యం లేకుండాపోయింది. దీంతో మండలాల్లో అభివృద్ధి చేసుకోలేక, ప్రజలకు సమాధానం చెప్పలేక వారు జగన్ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. టీడీపీ కూటమికి గెలుపు అవకాశాలు పెరుగుతున్నాయని భావించి.. అత్యధికులు కూటమి వైపు చూస్తున్నారు.

వలసలు మొదలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు వైసీపీని వీడుతున్నారు. కూటమి పార్టీల్లో చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. జడ్పీ ఎన్నికలు గతంలో ఏకపక్షంగా సాగాయి. దీంతో టీడీపీ, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కొక్కరు మాత్రమే గెలిచారు. మిగిలిన స్థానాలన్నీ వైసీపీకి సొంతమయ్యాయి. అంతటి హవాలో సైతం అగళిలో టీడీపీ అభ్యర్థి జడ్పీటీసీగా గెలిచి నిలిచారు. ఇంతమంది గెలిచినా.. వైసీపీ జడ్పీటీసీలకు ఆ పార్టీ న్యాయం చేయలేదు. రెండున్నరేళ్ల నుంచి వారిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇటీవలే చిలమత్తూరు వైసీపీ జడ్పీటీసీ అనూష టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ వర్గానికి చెందిన అనూషతోపాటు పలువురు ఎంపీటీసీలు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా బత్తలపల్లి జడ్పీటీసీ కోటి సుధ వైసీపీకి రాజీనామా చేశారు. ఆమెతోపాటు ఆమె భర్త, కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాశ్‌బాబు మరికొందరు సైతం జగన్ పార్టీ గుడ్‌బై చెప్పారు. సూర్యప్రకాశ్‌బాబు, ఆయన సతీమణి, బత్తలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కోటిసుధ, ఆయన సోదరులు ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేశ్, ఉపసర్పంచ్ కోటి గోపీనాథ్‌తో పాటు పలువురు బీజేపీలోకి చేరారు. వారు పట్టణంలో మంగళవారం కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో, కేంద్రమంత్రి విజయ్‌కుమార్ సింగ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కోటి కుటుంబానికి బత్తలపల్లి మండలంలో బలమైన వర్గం ఉంది. వీరి చేరికతో బత్తలపల్లిలో బీజేపీ బలం అమాంతం పుంజుకుంది. అదేవిధంగా ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సైతం వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనను గత కొంత కాలంగా స్థానిక ఎమ్మెల్యే తీవ్రంగా వేధించినట్లు, అభివృద్ధి పనులు సైతం సాగకుండా అడ్డుపటినట్టు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో అభివృద్ధి శూన్యం అని భావించి ఆయన బీజేపీలో చేరారు. ధర్మవరం నియోజకవర్గం కూటమి అభ్యరి సత్యకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు జగన్ పార్టీ మునిగే నావగా భావించి టీడీపీ కూటమి వైపు చూస్తున్నారు.

త్వరలో మరికొందరు...

ఇప్పటికే జడ్పీటీసీలు, ఎంపీపీలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గత రెండున్నరేళ్లగా నిధులు రాక, అభివృద్ధి లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు జడ్పీకి వస్తే.. ఇక్కడి ఉన్నతాధికారులు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని, పాలకవర్గాన్ని పూర్తిగా విస్మరించి ముందుకెళ్తున్నారంటూ ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలోనే జడ్పీ చైర్పర్సన్‌తోపాటు, సుమారు 30 మంది వరకూ జడ్పీటీసీలు సీఈఓ, డిప్యూటీ సీఈఓపై ఫైర్ అయ్యారు. సమావేశాన్ని బహిష్కరించి, బయటకొచ్చి ఆందోళన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కనీసం స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించలేదు. ఇలాంటి పరిస్థితుల నడుమ వైసీపీలో ఉన్నా మండలాల్లో అభివృద్ధి సాధించలేమన్న యోచనలో మెజార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు ఉన్నారు. దీంతో టీడీపీ- బీజేపీ కూటమిలో చేరేందుకు మెజార్టీ సభ్యులు ఉత్సాహం చూపుతున్నారు. సుమారు 25 నుంచి 30 మంది వరకూ జడ్పీటీసీలు కూటమి బాట పట్టనున్నట్టు ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది.



వైసీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన ముదిగుబ్బ ఎంపీపీ (ఫైల్)



దుమ్ములోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో...?

అనంత నడిబొడ్డు టవర్‌క్లాక్ వద్ద దుస్థితి... రాకపోకలకు తీవ్ర అంతరాయం

అనంతపురం సిటీ, ఏప్రిల్ 24 : నగరంలో అత్యంత ప్రధానమైన రహదారులలో పీటీసీ ఫ్లైఓవర్ బ్రిడ్జి ముఖ్యమైనది. కేంద్రం ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.311.93 కోట్లు వెచ్చించింది. 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఈ బ్రిడ్జికి ఒకవైపు (శాంతి థియేటర్, బెంగుళూర్ బేకరీ షాపు వైపు) సర్వీస్ రోడ్డు ఏళ్ల తరబడి నిర్మాణ పనులు చేయకపోవడంతో అవస్థల నడుమ వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే, మేయర్ తదితర ప్రజా ప్రతినిధులకు నిత్యం ఈ సమస్య కనిపిస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. కొందరు ప్రైవేట్ స్థలాల వ్యక్తులు పనులు చేస్తుంటే.. ఆ రోడ్డుపైకి దుమ్ము లేస్తోంది. అయినప్పటికి ఏ ఒక్కరు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే మాత్రం.. బ్రిడ్జిని అన్ని హంగులతో పూర్తి చేశాం.. త్వరలోనే ఈ సర్వీస్ రోడ్డును పూర్తి చేస్తాం అని చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని నగర వాసులు విమర్శిస్తున్నారు. వాహనచోదకులు, పాదచారుల, సర్వీస్ రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల యజమానుల పరిస్థితి ఏమిటో ఈ చిత్రాలు చూస్తే తెలిసిపోతుంది. ఈ రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉండటంలో ఏమాత్రం వ్యాపారాలు జరగడం లేదని వాపోతున్నారు.



శాంతి థియేటర్ వైపు సర్వీస్ రోడ్డు ..

ఎల్‌ఎంకు అవమానం!

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 24: నియోజకవర్గంలో పట్టున్న వైసీపీ సీనియర్ నాయకుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డికి అవమానం జరిగిందని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తలారి రంగయ్య బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆయన్ను రోడ్‌షోకే పరిమితం చేశారు. నెల రోజుల కిందట పార్టీలోకి వచ్చిన ఉమామహేశ్వర నాయుడుని మాత్రం నామినేషన్ దాఖలు చేయడానికి వెంట పెట్టుకుని ఆర్‌ఓ వద్దకు వెళ్లడంపై ఎల్‌ఎం అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనుచరులు, పట్టున్న సీనియర్ నాయకుడికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పిలిచి అవమానించడంలో అంతర్యమేమిటని నిలదీస్తున్నారు.




వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌ఎం మోహన్‌రెడ్డి

చెప్పులు వేయించుకున్నవారికి ఎంపీ టిక్కెట్టా?

వైసీపీ రెబల్ ఎంపీ అభ్యర్థి గంపల రమణారెడ్డి

వెంకటరమణా రెడ్డి



పెనుకొండ టౌన్, ఏప్రిల్ 24: 'రాష్ట్ర చరిత్రలో రెండుసార్లు చెప్పులు వేయించుకున్న నాయకుడు మాజీమంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ మాత్రమే. అలాంటి నాయకుడికి ముఖ్యమంత్రి జగన్ ఎంపీ టిక్కెట్ ఇవ్వడం బాధాకరం' అని సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి అన్నారు. గోరంట్ల మండలం కరావులపల్లికి చెందిన రమణారెడ్డి అనంతపురం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు బుధవారం పెనుకొండలో మీడియాకు వివరించారు. గడచిన నాలుగున్నరేళ్లలో శంకర్‌నారాయణ ఎంత వేధించినా వైసీపీని వీడలేదన్నారు. వైసీపీకి చెందినవారిపైనే శంకర్‌నారాయణ 50 కేసులు బనాయిస్తే అందులో తమ సామాజికవర్గానికి చెందినవారే 48 మంది బాధితులు ఉన్నారన్నారు. పలుమార్లు మా సమస్యలను ముఖ్యమంత్రి, ఇతర నేతలవద్దకు తీసుకెళ్తే దగ్గరకు రానీయలేదన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం పునరాలోచించాలని అన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

అల్బర్ట్ అలియాండ్రో అండర్‌జో (జయంతి)



ఫ్రెంచ్ దేశానికి ప్రముఖ రచయిత, చిత్రకారుడు అల్బర్ట్ అలియాండ్రో అండర్‌జో 1927 ఏప్రిల్ 25న జన్మించారు. రెనె గాసినీతో కలసి 'ఏస్టిరిక్స్' సిరీస్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. ఆయన రూపొందించిన క్యారెక్టర్‌లు ఒంపా-పా, జెహాన్ పిస్టోలెట్ అండ్ లక్ జూనియర్ ఎంతో పేరొందాయి. ఆయన సాధనలకు లెజియన్ ఆఫ్ హానర్, ది నైట్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ది నెదర్లాండ్స్ లయన్, తదితర అవార్డులు పొందారు. 2020 మార్చి 24న కన్నుమూశారు.

మార్కోనీ (జయంతి)



ఇటలీ దేశానికి చెందిన ప్రముఖ ఆవిష్కర్త గుగిఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ 1874 ఏప్రిల్ 25న జన్మించారు. ఎలక్ట్రికల్ ఇంజనీర్, సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపేందుకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పితామహగా పేరొందారు. ఇతర భౌతిక శాస్త్రవేత్త ప్రయోగాల ఆధారంగా రేడియో ఆవిష్కరించారు. ఇటలీ రాజు కింగ్ విక్టర్ ఇమ్మానుయేల్ 3 ఆయనను 'మార్చీజ్' అవార్డుతో సత్కరించారు. ఎన్నో గౌరవాలు అందుకున్నారు. 1937 జూలై 20న కన్నుమూశారు.

స్వామి సుఖబోధానంద (పుట్టినరోజు)



ఆధ్యాత్మిక గురువుగానే కాక 'మోటివేషనల్ స్పీకర్‌'గా గుర్తింపు పొందిన స్వామి సుఖబోధానంద 1955 ఏప్రిల్ 25న బెంగళూరులో జన్మించారు. పూర్వ నామము ద్వారకనాథ్, 28వ యేట పూజ్య స్వామి దయానందచే సన్యాసం స్వీకరించారు. ప్రసన్న ట్రస్టు ద్వారా భగవద్గీత, ఉపనిషత్తులను ప్రచారం చేస్తున్నారు. 2005లో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో హిందూయిజంపై ప్రసంగించి ప్రపంచ వ్యాప్తంగా పేరొందారు. 'కార్పొరేట్ గురు'గా కూడా పిలుస్తుంటారు. వివిధ భాషల్లో 112కుపైగా పుస్తకాలు రచించారు 'ది యునైటెడ్ నేషన్స్ వరల్డ్ మిలీనియం సమ్మిట్ ఆఫ్ స్పిరియువల్ లీడర్స్'కు స్వామిజీ ప్రత్యేక అతిథిగా ఉన్నారు.

కనులపండువగా కరగ ఉత్సవం



వీరకుమారుల నడుమ కరగధారి ఊరేగింపు

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో చారిత్రాత్మకంగా జరిగే కరగ ఉత్సవం కనులపండువగా సాగింది. నగరత్‌పేటలో వెలసిన ధర్మరాయస్వామి ఆలయం నుంచి మంగళవారం రాత్రి ఒంటి గంట తర్వాత కరగ ఆరంభమైంది. సాయంత్రం నుంచే ఆలయంలో ప్రత్యేకపూజలు కొనసాగాయి. రాత్రి 11 గంటలకు రథోత్సవం జరిగింది. అర్చకుడు జ్ఞానేంద్ర ద్రౌపదీదేవి రూపంలో కరగను ధరించారు. ఆలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత గర్భగుడి నుంచి కరగను మోసుకుంటూ ఆలయం వెలుపలకు వచ్చారు. అప్పటికే వేలాదిమంది ఎదురు చూస్తున్న కరగ కనిపించడంతో గోవింద నామస్మరణలు మారుమోగాయి. నగరత్‌పేటలో ఆరంభమైన కరగ ఊరేగింపు హలసూరుపేట, గణిగరపేట, ఉప్పారపేట, అక్కిపేట, అరళేపేట, బళేపేట, కుంబారపేట, గొల్లరపేట, మామూల్‌పేట్, తిగళరపేట, సునకల్‌పేట, అవెన్యూరోడ్డు, బీవీకే అయ్యంగార్ రోడ్డుమీదుగా సాగింది. కరగను మోసిన జ్ఞానేంద్ర చేతిలో ఖడ్గం, గంటతో ముందుకు కదలగా వేలాది మంది వీరకుమారులు తరలారు. దేవాలయంలో ధర్మరాయస్వామి అలంకరణ కరగ కోసం సేలం నుంచి 4వేలకుపైగా మల్లెపూల హారాలు, 3వేల కేజీల మల్లెలు తీసుకొచ్చారు. వీరకుమారులు పూలమాలలు ధరించి కరగవెంట నడిచారు. బుధవారం ఉదయం 7 గంటలదాకా కరగ ఉత్సవం సాగేది. అయితే గంటన్నరకు ముందుగానే కరగ ఆలయ ప్రాంగణానికి చేరింది. ధర్మరాయస్వామి ఆలయం వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు సతీశ్ పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో 5కేజీల కర్పూరాన్ని వెలిగించారు. కరగ ఉత్సవంలో సీఎం సిద్దరామయ్య పాల్గొన్నారు. కరగ ఆలయం నుంచి వెలుపలికి వచ్చిన సమయంలో సీఎంకు ఆశీర్వాదం చేసింది. కాంగ్రెస్ నేతలు హారిస్, పీఆర్ రమేశ్ సహా పలువురు పాల్గొన్నారు.

పలుచోట్ల రథోత్సవాలు

అవెన్యూరోడ్డు, బీవీకే అయ్యంగార్‌రోడ్డుతోపాటు మార్కెట్ ప్రాంతంలో వెలసిన పదులసంఖ్యలో ఆలయాలలో మంగళవారం రాత్రి రథోత్సవాలు సాగాయి. సాయంత్రం నుంచే పూజలు జరిపి 10 గంటల వేళ రథోత్సవాలు కొనసాగాయి. అణ్ణమ్మదేవితోపాటు పలు ఆలయాల రథోత్సవాలల్లో భక్తులు పాల్గొన్నారు. కరగ ఉత్సవం ప్రారంభమయ్యేలోగానే రథోత్సవాలు కొనసాగే సంప్రదాయం ఉంది.



ద్రౌపదీ సమేత ధర్మరాయస్వామి రథోత్సవం

కాంగ్రెస్‌కు దళిత సంఘాల మద్దతు



మీడియా సమావేశంలో వివిధ దళిత సంఘాల ప్రముఖులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 24: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వనున్నట్టు వివిధ దళిత సంఘాలు మద్దతు పలికారు. పట్టణంలోని బస్టాండ్ సమీపాన భక్తరహళ్లి మునేగౌడ ఫ్యాక్టరీ ఆఫీసులో బుధవారం వివిధ దళిత సంఘాల ప్రముఖులు భేటీ అయ్యారు. కర్ణాటక దళిత సంఘర్ష సమితి జిల్లా సంచాలకులు సీవీ లక్ష్మణరాజు మీడియాతో మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ధారించే అతి పెద్ద ఎన్నికల్లో దళిత సంఘాల పాత్ర కీలకమన్నారు. రాజ్యాంగాన్ని మార్పు చేస్తామన్న బీజేపీ తీరును తప్పుబట్టారు. దళితుల సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకూడదన్నారు. ఈ నేపథ్యంలో తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. డీఎస్ఎస్ జిల్లా నాయకుడు నాగనరసింహ మాట్లాడుతూ బీజేపీ మతతత్వవాదులను సృష్టించి మతాల ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకమైన చట్టాలను జారీ చేసిందని, అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా..? అని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. చిన్న చిన్న ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, నిరుద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. తాలూకా వాల్మీకి నాయక యువసేన అధ్యక్షుడు ముత్తూరు వెంకటేశ్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు చేయలేదన్నారు. దేశాభివృద్ధికి తగిన పథకాలు అమలు కాలేదన్నారు. దళిత, వెనుకబడిన, పేదల వ్యతిరేకిగా ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని తొలగించాలన్నారు. మీడియా సమావేశంలో నగరసభ సభ్యుడు మంజునాథ్, దళిత సంఘర్ష సేన తాలూకా సంచాలకులు రవిశంకర్, దళితసేన జిల్లా ఉపాధ్యక్షుడు కే నారాయణస్వామి, మాదిగ దండోరా తాలూకా ఉపాధ్యక్షుడు దామోదర్ మునిరాజు, టీపీ చలపతి, ద్యావప్ప, తిరుమళప్ప, మునికదిరప్ప, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షకులకే మద్దతిస్తాం



మీడియాతో సూలికుంటె ఆనంద్

బంగారపేట, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగాన్ని కాపాడేవారికే తమ మద్దతు ఉంటుందని దళిత సమాజసేన సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ వెల్లడించారు. పట్టణంలో బుధవారం సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మృతి చెందినవేళ బాంబేకు తరలించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించలేదని, ఆయన జీవితకాలంలో భారతరత్న ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశానికి ప్రపంచం మెచ్చేలా గొప్పటి రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారన్నారు. దేశ తొలి న్యాయ మంత్రిగా వ్యవహరించారని కాంగ్రెస్ తీరుతో అప్పట్లో ఆయన తన స్థానానికి రాజీనామా చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ తాను దళితపక్షపాతి అంటూ గొప్పలు చెబుతోందన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులకు ఎకరాల కొద్దీ స్మశానికి కేటాయించారని, అయితే రాజ్యాంగ నిర్మాతకు కనీసం అంత్య సంస్కారాలకు కూడా వీలు కల్పించలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేడ్కర్‌కు అగ్ర, నిమ్న వర్గాల తారతమ్యం లేదన్నారు. అయితే సమాజంలో వెనుక బడిన వర్గాల ఉన్నతికోసం కొంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు నాగేశ్, అయ్యప్ప, ఎస్‌వీ మంజు, దిసై రాజ్, రాజేశ్, జాన్, మునిరాజు, సుబ్రమణి, యల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై దళితసంఘాల వ్యతిరేకత



మీడియా సమావేశంలో దళిత సంఘాల నాయకులు

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల్లో ఈనెల 26న జరిగే పోలింగ్‌కు బీజేపీకి వ్యతిరేకమని బహుజన దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎంఎన్ రమేశ్ వెల్లడించారు. బుధవారం హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీజేపీకి, ప్రధాని మోదీకి దళిత సంఘాలు వ్యతిరేకమన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్పు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. గత పదేళ్లలో రాజ్యంగ వ్యతిరేకంగా బీజేపీ పాలన సాగించిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో తాము కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. బీజేపీకి వచ్చిన విరాళాల వివరాలను సక్రమంగా విడుదల చేయలేదన్నారు. దళితులను కేవలం ఓటుబ్యాంకుగానే పరిగణించారని ఆరోపించారు. గత పదేళ్లలో దళితులకు, బడుగు బలహీనవర్గాలకు బీజేపీ ఎటువంటి సానుకూలం చేయలేదన్నారు. పదేళ్లలో వారు ఏం సాధించారని ప్రశ్నించారు. మోదీకి ఎందుకు ఓటు వేయాలన్నారు. మోదీ ఏం సాధించారని, కేవలం కార్పొరేట్ శ్రీమంతులకు రుణాలు మాఫీ చేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక బుక్‌లెట్ విడుదల చేశారు. కాగా బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యరెడ్డికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. మీడియా సమావేశంలో దళిత సేనా సేవా సమితి, వివిధ దళిత సంఘాల నాయకులు చంద్రప్ప, రామచంద్ర, రవికుమార్, నందీశ్, కృష్ణమూర్తి, మురళి వెంకటేశ్, శేఖర్, మునీషా, సునీతాకుమారి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మదేవి కరగ మహోత్సవం



పురవీధులలో కరగధారి ఊరేగింపు

విజయపుర, ఏప్రిల్ 24: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని రేణుకా ఎల్లమ్మదేవి ఆలయ 85వ వార్షిక పూల కరగ మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ, అభిషేకం, హారతి అనంతరం అగ్నిగుండ ప్రవేశం, కులుగుర్రాలు, గారడీ బొమ్మలు, నెమలు ప్రదర్శన, వసంతోత్సవం తదిదర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఏటా జేఆర్ దేవరాజ్ కరగను ధరించిన రీతిలో ఈసారి కూడా కరగతో ఊరేగారు. కరగతో నృత్యం చేస్తూ పురవీధులలో సాగారు. ఎంకే అనంతకుమార్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. మంగళవారం రాత్రి ప్రారంభమైన కరగ ఊరేగింపు బుధవారం ఉదయం వరకు కొనసాగింది. శివనాపురకు చెందిన ఆదిశక్తి మహాసంస్థాన వహ్నికుల క్షత్రియ పీఠాధిపతి జగద్గురు ప్రణవానందపురి స్వామిజీ పాల్గొని భక్తులను ఆశీర్వదించారు. ఉత్సవంలో చిక్కబళ్ళాపుర బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్, బీజేపీ నాయకుడు కట్టా సుబ్రమణ్యంనాయుడు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మునీంద్ర, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కనకరాజు, ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ వ్యతిరేకి బీజేపీ : రమేశ్ కుమార్



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

బాగేపల్లి, ఏప్రిల్ 24: విగ్రహ ప్రతిష్ఠాపన, గర్భగుడి వంటి వాటిపై స్పష్టత లేని హిందూ వ్యతిరేకి బీజేపీ అని మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఏర్పాటైన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీజేపీ వారు ధర్మశాస్త్రాన్ని గాలికి వదిలేసి ఆత్రుతగా రామమందిరాన్ని నిర్మించారన్నారు. అందుకు మోదీ పది రోజులు ఉపవాసం ఉండడం, గోచీ కట్టి పూజలు చేశారని వ్యంగ్యం చేశారు. దేశ స్వాతంత్ర్యంలో బీజేపీ వారి పాత్ర ఏముందని ప్రశ్నించారు. కొవిడ్ వంటి సమయంలో గంట, డప్పు కొట్టారన్నారు. దేశంలో ఎలాంటి మార్పు తేవాలనుకున్నారో అంటూ ప్రశ్నించారు. ఓటర్లు బుద్ధివంతులని ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేసి తగిన బుద్ధి చెబుతారన్నారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ కే సుధాకర్ ఒక పాఠశాల ఉపాధ్యాయుడి కుమారుడు అని, ఆయనకు కోట్లాది రూపాయల ఆస్తులు ఎక్కడనుంచి వచ్చాయన్నారు. తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిస్తే, సుధాకర్ రెండుసార్లు గెలిచారన్నారు. తనకంటే ఎక్కువ ఆస్తులు ఎలా సంపాదించారన్నారు. కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేంద్ర, ప్రభాకరరెడ్డి, మంజునాథరెడ్డి, నాగరాజు, పూజప్ప తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు ఫయాజ్‌తో నేహా ఫోటోలు.. ప్రభుత్వమే లీక్ చేసింది

» కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో ఎంసీఏ విద్యార్థిని నేహా హిరేమఠ హత్యానంతరం నిందితుడు ఫయాజ్‌తో ఉండే ఫోటోలను ప్రభుత్వమే లీక్ చేసిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి తీవ్రమైన ఆరోపణలు చేశారు. బుధవారం హుబ్బళ్ళిలో మీడియాతో మాట్లాడుతూ నేహా హిరేమఠను హత్యచేసిన తర్వాత స్థానికులు ఫయాజ్‌ను గుర్తించి పట్టుకుని పోలీసులకు అప్పగించారన్నారు. నిందితుడి మొబైల్ నుంచి నేహా ఫోటోలను కర్ణాటక ప్రభుత్వమే లీక్ చేసిందన్నారు. వారిద్దరు ప్రేమలో ఉన్నారనే లాంటి ఫోటోలు ఫయాజ్ మొబైల్‌లో మాత్రమే ఉన్నాయన్నారు. హత్య జరిగిన కొద్దిసేపటికే ఫయాజ్ పోలీసుల అదుపులోకి చేరారన్నారు. నేహా హత్యకు గురైందని సదరు ఫోన్ కుటుంబీకుల వద్దనే ఉందన్నారు. ఇక పోలీసుల అదుపులో ఉండే ఫయాజ్ ఫోన్ నుంచే ఫోటోలను లీక్ చేసిన వారు ఎవరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వమే ఇదంతా చేస్తోందని ఆరోపించారు. నేహా హత్య తర్వాత మరో మహిళను మతాంతరం కోసం బెదిరించారని ఒప్పుకోనందుకు దాడి చేశారన్నారు. హుబ్బళ్ళి భాగంలో హిందూ సంఘాలు బలంగా ఉన్నాయని ఇక్కడే ఇంతటి దారుణాలు జరుగుతుంటే ఇతర ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ విచారం వ్యక్తం చేశారు. నీచ రాజకీయాలు చేసే వారు అధికారం నుంచి తొలగాలని లేకుంటే హిందూ ధర్మం, సంస్కృతిని ఇళ్లలోను కాపాడుకోవడం కష్టం కానుందని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు.

ఘనంగా గంగాదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 24: తాలూకాలోని పురాణ ప్రసిద్ధమైన ఆలయాలలో ఒకటైన మేలూరు గంగాదేవి బ్రహ్మ రథోత్సవం ఘనంగా జరిగింది. జానపద కళాబృందాలు, డప్పువాయిద్యాలు, గారడీ బొమ్మలు సందడి చేశాయి. ఆలయంలో లోకకల్యాణార్థం పలు హోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రథంపై కొలువుదీర్చారు. రథోత్సవంలో భక్తులు తేరుపై అరటిపండు వేయడం ద్వారా మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ సహా అన్నసంతర్పణ నిర్వహించారు. అమ్మవారిని కొలవడం ద్వారా దుష్ట శక్తులనుంచి గ్రామానికి రక్షణగా ఉంటారని భక్తుల విశ్వాసం. ఉత్సవాల్లో జేడీఎస్ నాయకుడు బీఎన్ సచిన్, గ్రామపంచాయతీ సభ్యుడు ఉమేశ్, ఎంకే రవిప్రసాద్, ఎంజే శ్రీనివాస్, రాజ్‌కుమార్ అభిమానుల సంఘం ధర్మేంద్ర, కేఎస్ మంజునాథ్, సుదర్శన్, సుదీర్, శ్రీనివాసమూర్తి, శివకుమార్, ఆలయ సమితి పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


దొమ్మసంద్ర, ఏప్రిల్ 24: ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు, బీజేపీ ప్రముఖుడు ఎస్‌వై వెంకటేశ్ బుధవారం ఎమ్మెల్యే బీ శివణ్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనను పార్టీ జెండాతో ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ 20ఏళ్లగా బీజేపీలో కార్యకర్తగా కొనసాగానని సరైన స్థానం దక్కకపోవడంతో బీజేపీలో చేరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్‌వై శంభయ్య, ఎస్ఎం శ్రీనివాస్, ఎస్‌వీ శ్రీనివాస్ బుడగప్ప, వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఏ సతీశ్ కుమార్, సభ్యుడు డాక్టర్ మంజునాథ్ సర్జా, ముఖ్యులు వాజీద్, శ్రీకాంత్, యల్లప్ప, గౌరీశ్, గుడ్డహట్టిశంభప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక కిక్కు..!

● వైసీపీ నామినేషన్‌కు యథేచ్ఛగా మద్యం సరఫరా

లేపాక్షి, ఏప్రిల్ 24: హిందూపురం నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి దీపిక నామినేషన్‌కు యథేచ్ఛగా కర్ణాటక మద్యం సరఫరా చేశారు. అధికారం ఉంది కదా అని ఆ పార్టీ కార్యకర్తలు కర్ణాటక మద్యాన్ని ద్విచక్రవాహనంలో పబ్లిక్‌గానే తరలించారు. గ్రామ చివరన మందు సేవించి, నామినేషన్ కార్యక్రమానికి హాజరైనట్లు ప్రజలు చర్చించుకున్నారు. ద్విచక్రవాహనంలో మద్యం తరలించడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. పబ్లిక్‌గానే మద్యం తరలిస్తున్న పోలీసులు తనిఖీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.47	1,576.37
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	167	251
సామర్థ్యం (టీఎంసీలు)	3.77	2.96

ఘనంగా రాజ్‌కుమార్ జయంతి



రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గురురాజ్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24: ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ అవార్డు గ్రహీత డాక్టర్ రాజ్‌కుమార్ 96వ జయంతిని బుధవారం సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో వార్తాపౌరసంబంధాల శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ తుకారంరావు రాజ్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పెన్షన్, చిన్న పొదుపు శాఖ సహాయ సంచాలకులు టి. హొన్నూరప్ప, న్యూస్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ డిపార్టుమెంట్ ఫస్ట్ గ్రేడ్ అసిస్టెంట్ గురురాజ్, సిబ్బంది రోజామేరీ, విజయ్ కుమార్, హనుమేశ్, మల్లేశప్ప, చౌదరి, రవి, రుద్రమునిస్వామి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలి



లోకమాన్య తిలక్‌కు నివాళులర్పిస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24: విద్యార్థులు దేశాభిమానం, దేశభక్తి , ఆత్మగౌరవం వంటి లక్షణాలతో జీవించాలని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. సంజీవరాయన కోట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరిగిన వేసవి శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జీవిత విశేషాలను, ఆదర్శ లక్షణాలు, దేశభక్తి గురించి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హనుమంతప్ప, శివప్ప, ఎర్రిస్వామి, విద్యార్థులు వైశాలి, తిప్పేశ్వరీ, ప్రియాంక, చందు తదితరులు పాల్గొన్నారు.

జైన్ ఇంట్లో రూ.23లక్షల నగదు స్వాధీనం



బళ్లారి సిటీ, ఏప్రిల్ 24: నగరంలో బుధవారం బ్రూస్‌పేట పోలీసులు, కంబలి బజార్‌లోని చున్నిలాల్ రాకేశ్ కుమార్ జ్యూవెలర్స్ యజమాని కమలేశ్ జైన్ ఇంటిలో సోదా చేసి రూ. 23లక్షల నగదు, 450గ్రాముల బంగారం, 13కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం వీటిని కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించామని, వెరిఫికేషన్ కొనసాగుతోందని ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

మృతురాలి కుటుంబానికి రూ. 5 లక్షల సాయం

కంప్లి, ఏప్రిల్ 24 : కొట్టూరు తాలుకా హారాళు గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి మిద్దె కూలి దడ్డి నాగమ్మ మృతి చెందడంతో తహసీల్దార్ జీకే అమరేష్ రూ. 5 లక్షల చెక్కును బుధవారం ఆ కుటుంబానికి అందించారు. వారితో పాటు కందాయ అధికారి హాలాస్వామి, గ్రామలెక్క అధికారి, నాగమ్మ కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా?

- రేపు బళ్లారికి రాహుల్ రాక
- సాయంత్రం మున్సిపల్ గ్రౌండ్‌లో సభ
- బహిరంగసభకు భారీ ఏర్పాట్లు
- మంత్రి నాగేంద్ర వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న బళ్లారి ఇన్‌చార్జిమంత్రి నాగేంద్ర

బళ్లారి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బళ్లారి లో మరోసారి అడుగు పెట్టనున్నారు. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో భాగంగా ఆయన శుక్రవారం కర్ణాటకకు రానున్నారు. 2018లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో రాహుల్ అప్పటి ఉమ్మడి జిల్లా అయిన విజయనగర కు వచ్చారు. తరువాత భారత్ జోడో యాత్ర నేపథ్యంలో ఇక్కడ బసచేసి ఇక్కడ నుండి పాదయాత్ర సాగించారు. తరువాత 2023 లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రచార నిమిత్తం ఆయన బళ్లారికి వచ్చారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా బళ్లారి కౌల్‌బజార్‌లో జీన్స్‌కుట్టే కుటుంబాలను పరామర్శించి బళ్లారిలో జీన్స్ పరిశ్రమ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. తరువాత ప్రస్తుతం జరుగనున్న ఎంపీ ఎన్నికల్లో ప్రచార నిమిత్తం ఆయన తిరిగి శుక్రవారం బళ్లారికి రానున్నారు.

ప్రతిపక్షాలు రాహుల్ ది ఐరన్ లెగ్ అంటున్నా, కాంగ్రెస్ వర్గాలు మాత్రం ఇందుకు బిన్నంగా రాహుల్‌ది గోల్డెన్ లెగ్ అని పేర్కొంటున్నాయి. 2018లో రాహుల్ పర్యటన నేపథ్యంలో బళ్లారి జిల్లాలో కాంగ్రెస్ ఎక్కువ ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకుంది.. తరువాత 2023లో ప్రచారంలో పాల్గొనగా ఏకంగా ఆరు ఎమ్మెల్యే స్థానాలు గెలవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడుకూడా రాహుల్ రాకతో రాయచూరు, బళ్లారి, కొప్పళ జిల్లాల్లో ఎంపీల గెలుపు ఖాయమని అని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. రాహుల్ రాక నేపథ్యంలో బళ్లారిలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. బళ్లారి మున్సిపల్ మైదానంలో బహిరంగ సభకు వేదిక సిద్ధం చేస్తున్నారు. దక్షిణ కర్ణాటకలో ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలంతా ఆరోజు హాజరు కానున్నారు. ఎలాగైనా ఈ స్థానాన్ని కైవశం చేసుకోవాలనే గట్టిపట్టుదలతో కాంగ్రెస్ వర్గాలు పనిచేస్తున్నాయి.

రాహుల్ ప్రచారంతో అధికారం ఖాయం : మంత్రి నాగేంద్ర

బళ్లారి సిటీ, ఏప్రిల్ 24: రాహుల్ ఎక్కడ ప్రచారం చేసినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బళ్లారి ఇన్‌చార్జిమంత్రి నాగేంద్ర అన్నారు. బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలిపించాలనే ఉద్దేశ్యంతో ఆయన ఈనెల 26న బళ్లారికి వస్తున్నారని పేర్కొన్నారు. రాయల్‌పోర్టులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈనెల 26వతేదీ శుక్రవారం సాయంత్రం బళ్లారి మున్సిపల్ గ్రౌండులో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఈ సదస్సుకు హాజరుకానున్నారని తెలిపారు. రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీసీఎం, శివకుమార్, మల్లికార్జున ఖర్గే ఇతర మంత్రులు రానున్నారు. ఈ మహాసభకు లక్షలాది మంది అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ ప్రచారం చేసినా కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి వచ్చిందన్నారు. అదేవిధంగా ఈలోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధిస్తారన్నారు. కాగా లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఈసారి తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా పెద్ద గంగావతి బంద్

నేహా హత్య కేసు దోషిని ఉరితీయాలని డిమాండ్

గంగావతి రూరల్ ఏప్రిల్ 24: నేహా హిరేమఠ్‌ను హత్య చేసిన నిందితుడు ఫయాజ్‌ను ఉరితీయాలని డిమాండ్‌చేస్తూ బుధవారం గంగావతి ప్రజలు ప్రశాంతంగా బంద్ నిర్వహించారు. నగరంలోని సిబీఎస్ సర్కిల్, మహావీర సర్కిల్, గాంధీ సర్కిల్‌కు భారీ ఎత్తున ప్రజలు చేరుకొని హుబ్లీలో విద్యార్థి నేహా హిరేమఠ్ హత్యను వ్యతిరేకిస్తూ బంద్ పాటించారు. ఈసందర్భంగా కల్మఠ స్వామి మాట్లాడుతూ హిందూ విద్యార్థినులను లవ్‌జిహాద్ పేరుతో ముస్లిం యువకులు ప్రేమించాలని వేధిస్తున్నారని, వారు నిరాకరిస్తే వారిని నిర్దాక్షిణ్యంగా హత్య చేస్తున్నారన్నారు.



బంద్‌లో పాల్గొన్న హిందూ సంఘాల కార్యకర్తలు

ఇలాంటి విషయాలను బాలికలు తల్లిదండ్రులకు వెంటనే చెప్పాలని, లేకుంటే పోలీస్‌స్టేషన్‌కు, లేదా హిందు సంఘాలకు తెలుపాలన్నారు. నేహాను హత్య చేసిన వారిని వెంటనే ఉరితీయాలని కోరారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే పరన్నామునవళ్ళి, జోగన్నారాయణప్ప నాయక్, వీరభద్రప్పనాయక్, హనుమంతప్పనాయక్, అన్న పూర్ణసింగ్, బసవరాజ స్వామి, రాజునాయక్, సంతోష్ కలోజీ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన రబీ జొన్నల కొనుగోలు

సిరుగుప్ప, ఏప్రిల్ 24 : ఎట్టకేలకు జొన్న రైతులకు ఊరట లభించింది. సిరుగుప్ప తాలుకాలో ఆహార పౌరసరఫరాల గోడౌన్‌లో నెలరోజుల కింద జొన్నల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జొన్నల కొనుగోలు చేసినా రబీ సీజన్‌కు సంబంధించి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో రెండు కిలోమీటర్ల పొడవునా ట్రాక్టర్లు నిలిచిపోయాయి. వారం రోజుల పాటు జొన్నల కొనుగోలును నిలిపివేశారు. దీ నిపై రైతులు లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే తహసీల్దార్ షంషాలం స్పందించి జిల్లా అధికారులతో చర్చలు జరిపి రిజిస్టర్ చేసుకున్న వారి నుంచి మాత్రం జొన్నల కొనుగోలు చేస్తామని తెలిపారు. దీంతో క్వింటాల్‌కు రూ. 3180 వంతున జొన్నలను కొనుగోలు చేస్తున్నట్లు ఆహారసరఫరాల గోడౌన్ మేనేజర్ చలవరాయ తెలిపారు.



జొన్నల కేంద్రం వద్ద బారులుతీరిన ట్రాక్టర్లు

అకాలవర్షంతో నేలకొరిగిన వరి చేలు



బన్నిమట్టి వద్ద నేలకొరిగిన వరి పంట

కంప్లి, ఏప్రిల్ 24 : అసలే కరువు. ఎక్కడా నీటిజాడలేదు. అలాంటిది బోర్ల కింద అక్కడక్కడా కొంత మేర వరి పంట పండించారు. అసలు లేదనుకుంటుంటే ఎంతోకొంత పండిందని రైతులు ఊరటచెందారు. ఇక పంటనుకోసి ఇళ్లకు చేర్చుకుందామనుకుంటుండగా అకాలవర్షాలు వచ్చాయి. వర్షం వల్ల కొంత చల్లదనం చేకూరినప్పటికీ పండిన వరి చేలు నేలకొరిగాయి. దీంతో రైతన్నలు కష్టాలను ఎదుర్కొంటున్నారు. చేతికొచ్చిన పంటలు నేలకొరగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీలో కాస్తో కూస్తో పండిన పంటలు కూడా ఇలా నష్టాలను మిగల్చడం ఇబ్బందిగా మారిందన్నారు. తుంగభద్ర నది ఒడ్డున హావిన అడగళి తాలుకాలో బాల్యాఉనిసి, రాజవాణ, బన్నేమట్టి ప్రాంతాల్లో సాగు చేసిన వరి పంటలు అకాల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని నాయకులు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మంత్రి నాగేంద్ర ప్రచారం



ప్రచారం చేస్తున్న మంత్రి నాగేంద్ర

బళ్లారి రూరల్, ఏప్రిల్ 24 : తాలుకాలోని చాగనూరు, అమరాపురం, బిసినళ్లి, తదితర గ్రామాల్లో బుధవారం మంత్రి నాగేంద్ర లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం ప్రచారం చేపట్టారు. మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వల్లే తమ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ప్రజలు, మహిళలు హస్తం గుర్తుకు ఓటు వేయాలని, రానున్న కాలంలో మహిళలకు మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, మానయ్య, యర్రగుడి ముద్దమల్లయ్య, అసోండి వన్నూరప్ప, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎర్రమట్టి రవాణాను అడ్డుకోలేరా?



భారీ వాహనాలతో ఎర్రమట్టి రవాణా

సిరుగుప్ప, ఏప్రిల్ 24 : తాలుకాలో అక్రమ ఎర్రమట్టి రవాణా జరుగుతున్నా జిల్లా గనుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఎర్రమట్టిని భారీ వాహనాలతో లోడుకు రూ. పదివేలు చొప్పున అమ్ముకుంటున్నారు. చాలాసార్లు ప్రజలు మైనింగ్ అధికారులకు తెలిపినా అప్పటికి మాత్రం చర్యలు తీసుకున్నట్లు నటించి అనంతరం వదిలివేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు, టాస్క్‌ఫోర్స్‌ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వైభవంగా బసవేశ్వరస్వామి రథోత్సవం



రథంలో ఊరేగుతున్న బసవేశ్వర స్వామి

కంప్లి, ఏప్రిల్ 24 : తాలుకా పరిధిలోని అనిజిగేరి గ్రామంలో బుధవారం బసవేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ప్రతి యేటా హంపి పౌర్ణమి సందర్భంగా ఈ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ రథాన్ని ఆలయం నుంచి బసవన్న కట్ట వరకు ఊరేగించారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన రికార్డులు, విద్యుత్ మీటర్లు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 24: నగరంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న జెస్కాం శాఖ వినియోగదారుల సేవా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 30కి పైగా విద్యుత్ మీటర్లు, వినియోగదారులకు సంబంధించిన రికార్డులు కాలి బూడిదయ్యాయి. కార్యాలయంలో విద్యుత్ కనెక్షన్‌ల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ వినియోగదారులు జెస్కాం శాఖకు అందజేసిన రికార్డులు ఈ ప్రమాదంలో బూడిదయ్యాయి. సంబంధిత సంఘటనకు సంబంధించి వివరాలు అందజేయడానికి జెస్కాం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయరు అశోక్ రెడ్డి అందుబాటులో లేరు.

హోసూరు జోన్

కృత్రిమంగా పండిన మామిడిపై బహుపరాక్



కృత్రిమంగా పక్వానికి తెచ్చిన మామిడి పండ్లు

హోసూరు, ఏప్రిల్ 24: వేసవి సీజన్‌లో రసాయనాల ద్వారా పక్వానికి తెచ్చిన మామిడి పండ్లను వాడరాదని ఆహార శాఖ అధికారులు సూచించారు. కృష్ణగిరి జిల్లాలో మామిడి సాగు అధికం. ఇక్కడ పండించే మామిడిపండ్లను స్థానికంగా, విదేశాలకు సైతం ఎగుమతి చేస్తుంటారు. అదే విధంగా మామిడిపండ్లు ఫ్యాక్టరీలకు కూడా సరఫరా అవుతుంటాయి. ఈసారి తగినంత వర్షాలు లేకపోవడంతో మామిడి సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. మల్లోవా వంటి మామిడి పండ్లు మాత్రమే అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. మే నెల ఆరంభంలో ఇతర రకాల మామిడి పండ్లు మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తాయని వ్యాపారులు అంటున్నారు. కాగా ఇటీవల కొన్నిచోట్ల రసాయనాల ద్వారా కృత్రిమంగా పక్వానికి తెచ్చిన పండ్ల విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సహజంగా పక్వానికి వచ్చిన మామిడిపండ్లను నీటిల్లో వేస్తే మునిగిపోతాయని, నీటిలో తేలితే అవి కృత్రిమంగా పక్వానికి తెచ్చినపండ్లుగా గుర్తించవచ్చని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

తాగునీటి సమస్యపై ప్రజల నిరసన

హోసూరు, ఏప్రిల్ 24: హోసూరు కార్పొరేషన్ పరిధిలో 45 వార్డులు ఉండగా దాదాపు అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కేసిసి నగర్, అన్నా నగర్, కామరాజ్ నగర్, రెయిన్‌బో గార్డెన్, తిమ్మచంద్రం, సహా 45 వార్డులలో నీటి ఎద్దడి నెలకొంది. దీనిపై 9వ వార్డు పరిధిలోని తిమ్మచంద్రం ప్రాంత వాసులు బుధవారం ఖాళీ బిందెలతో హోసూరు కార్పొరేషన్ ముందు బైఠాయించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ కమీషనర్ స్నేహా, ఇతర అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంజనీర్ రాజారాం జోక్యం చేసుకుని ప్రజలకు నచ్చచెప్పడంతో నిరసన వీడారు.

సీఎంతో ఎమ్మెల్యేల భేటీ

హోసూరు, ఏప్రిల్ 24: కృష్ణగిరి పశ్చిమ జిల్లా, తూర్పు జిల్లా ఎమ్మెల్యేలు బృందంగా చెన్నై వెళ్లి ముఖ్యమంత్రి స్టాలిన్‌తో బుధవారం భేటీ అయ్యారు. 19న సార్వత్రిక లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను వారు ఆయన నివాసంలో కలిశారు. జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ఆహార సరఫరా శాఖ మంత్రి చక్రపాణి, కృష్ణగిరి జిల్లా కార్యదర్శులు ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య, మదియళగన్‌లు మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ నియోజక వర్గం ఇన్‌చార్జ్ రిజల్యూషన్ కమిటీ వైస్ చైర్మెన్, నామకల్ బార్ ఇళంగోవన్, ఉప కార్యదర్శి మురుగన్, కృష్ణగిరి నగర కార్యదర్శి నవాబ్, రాష్ట్ర వ్యవసాయ బృందం ఉప కార్యదర్శి దామో వెంకటేశం, జిల్లా యువజన బృందం ఆర్గనైజర్ దినేశ్ పాల్గొన్నారు.



సీఎం స్టాలిన్‌తో ఎమ్మెల్యేల బృందం

29న ప్రధాని రాయచూరుకు రాక



రాయచూరు, ఏప్రిల్ 24 : లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో రెండు ప్రధాన పార్టీలకు చెందిన అగ్రనాయకుల రాకకోసం స్థానిక నాయకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ తరఫున ప్రచారం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 29వ తేదీన రాయచూరుకు రానున్నట్లు తెలిసింది. ఇప్పటికే కలబుర్గి, కొప్పళ నియోజక వర్గాల్లో ప్రధాని ప్రచారానికి సంబంధించిన తేదీలు ఖరారు కాగా 29న రాయచూరుకు వచ్చేలా పార్టీ శ్రేణులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందు కోసం బుధవారం నగర సమీపంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో సభ ఏర్పాట్లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్ పరిశీలించారు. అదే విధంగా ఈ నెల 29వ తేదీనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు రానున్నట్లు తొలుత సమాచారం. కాని దాన్ని మే 1వ తేదీకి మార్చుకున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి డీకే కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

కుటుంబ స్వార్థం కోసమే బీజేపీలో జేడీఎస్ విలీనం

- మాజీ సీఎం కుమారస్వామిపై కాంగ్రెస్ నేతల గుస్సా



జేడీఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

రాయచూరు, ఏప్రిల్ 24 : తమ కుటుంబ స్వార్థం, రాజకీయ ప్రయోజనాలను ఆశించి మాత్రమే జేడీఎస్ బీజేపీతో మైత్రి చేసిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రవి బోసరాజు అన్నారు. పార్టీకి చెందిన సీనియర్‌లు, పార్టీ కోసం శ్రమించిన వారిని పక్కనబెట్టి అందరిని వంచించిన మాజీ సీఎం హెచ్‌డీ కుమార స్వామికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జేడీఎస్‌కు చెందిన విశ్వనాథ పట్టి తదితరులు పెద్దసంఖ్యలో బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన రవి బోసరాజు, జేడీఎస్ పేర్లోనే సెక్యూలరిజమ్ ఉందని, నాయకుల్లో లేదని ఎద్దేవా చేశారు. మరో నాయకుడు, మాజీ జడ్పీ సభ్యుడు బషీరుద్దీన్ మాట్లాడుతూ, 10 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెలిక్కి తీస్తామని, పేదల ఖాతాలో రూ.15 లక్షలు జమా చేస్తామని చెప్పిన వాళ్లు ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న వాళ్లు తమ హామిని ఏమేరకు నిలుపుకున్నారో ప్రజలకు వివరించాలన్నారు. నరేంద్ర మోదీ చెబుతున్నవన్ని అబద్ధాలేనని ఆయన ఎద్దేవా చేశారు.